HICON SERIES

CLASS 3 TELUGU

తెలుగు వెలుగు CLASS 3

LESSON 2






CLICK HERE TO ACTIVATE

**LESSON**
PART 2

# 2 తెలివైన అమ్మాయి

అనగనగా ఒక రాజు. రాజ్యాన్ని చక్కగా పాలిస్తున్నాడు. రాజుకు 60 ఏళ్ళు నిండటంతో షష్టిపూర్తి ఉత్సవాలు రాజ్యమంతా ఘనంగా జరిగాయి.

ఆ వేడుకలో రాజుగారు ఒక ప్రకటన చేశారు. "రాబోయే పున్నమిరోజున నేనొక ప్రశ్న అడుగుతా. దానికి జవాబు చెప్పినవారికి వెయ్యి బంగారు నాణాలు ఇస్తాను. నా కొలువులో ఉద్యోగం కూడా ఇస్తా" అని రాజు ప్రకటించాడు.



మహారాజుగారు ఎలాంటి ప్రశ్న అడుగుతారో, ఎవరు జవాబు చెబుతారో అని రాజ్యమంతా పున్నమి రోజు కోసం ఆసక్తిగా ఎదురుచూసింది. పండితులు, మేధావులు, విద్యావంతులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ఉవ్విళ్ళూరుతున్నారు. కొందరైతే గ్రంథాలను రాత్రింబవళ్ళూ చదువుతున్నారు. ఈ వార్త గ్రామాల్లోకి పాకింది. ఒక రైతు కూతురు వెన్నెల రాజుగారి ప్రకటన గూర్చి విన్నది. వెన్నెల చాలా తెలివైనపిల్ల. నేను కూడా రాజుగారి సభకు వెళతానని మారాం చేసింది. అమ్మా నాన్నలు తీసుకెళతామన్నారు.

పౌర్ణమిరోజు రానే వచ్చింది. జనం తండోపతండాలుగా రాజుగారి సభామండపానికి చేరుకొన్నారు. రకరకాల వేషధారణలతో విద్వాంసులు వచ్చారు. వెన్నెల కూడా వాళ్ళమ్మా

నాన్నలతో పాటు వచ్చింది. పున్నమి రాత్రి కాబట్టి వేదికంతా వెన్నెలతో నిండి పిండి పరిచినట్లుగా ఉంది. రాజుగారు సభలోకి వచ్చి, ఆసనంపైన కూర్చున్నారు. అంతా నిశ్శబ్దం. అందరూ రాజుగారి ప్రశ్నకోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.

రాజుగారు ఈ విధంగా చెప్పారు, "మహారాణిగారికి గుత్తివంకాయ కూర తినాలనిపించింది. వెంటనే వంటవాడిని పిలిచింది. 'మసాలా బాగా వెయ్యి. గుమగుమలాడేలా గుత్తివంకాయ కూర చెయ్యి' అని ఆజ్ఞాపించింది. వంటవాడు కూర వండడం మొదలుపెట్టాడు. సన్నికల్లు (గుండ్రాయి) మీద మసాలా నూరుతున్నాడు. వాసన అంతఃపురమంతా వ్యాపించింది. వంటవాడి కూతురు ఉయ్యాలలో ఏడుస్తుంది. పొయ్యిదగ్గర ఉన్న నీళ్ళ గంగాళం పట్టుకొని వంటవాడి కొడుకు ఆడుకుంటున్నాడు. ఆ నీళ్ళు పడి మంటలు ఆరుతున్నాయి. వంటవాడికి విపరీతమైన కోపం వచ్చింది. ఈ సంగతిని గమనించిన వంటాయన భార్య 'ఒరే పొయ్యి దగ్గర నీకేం పని ? పొయ్యిలో పడ్డావంటే నీ చావు మూడుతుంది. జాగ్రత్త' అని పిల్లోడిని తిట్టి అక్కడి నుంచి తీసుకువెళ్ళింది. మొత్తానికి గుత్తి వంకాయ కూర తయారైంది. కూరతిన్న మహారాణి సంతోషపడి వంటవాడికి బంగారు నాణాలు బహుమతిగా ఇచ్చింది."

"కథ విన్నారుగా ! రాణిగారు వంటాయనకు ఎన్ని బంగారు నాణాలు ఇచ్చిందో చెప్పండి. ఇదీ ప్రశ్న" అని ముగించాడు రాజు .

పండితులందరూ తలలు గోక్కున్నారు. కొందరు 'ఇది చెత్త ప్రశ్న' అన్నారు. కొందరు ఈ విషయం ఏ గ్రంథంలో రాయబడిలేదన్నారు. కొందరు అనవసరంగా వచ్చామని, పరువు పోయిందని బాధపడ్డారు. ఒక్కరు కూడా జవాబు చెప్పలేకపోయారు.

వెన్నెల వాళ్ళ నాన్న భుజాల మీదకెక్కి కథ బాగా విన్నది. "మహారాజా ! మీ ప్రశ్నకు నేను జవాబు చెబుతాను" అన్నది. అందరూ ఆశ్చర్యపోయారు. రాజు ఆప్యాయంగా వెన్నెలను దగ్గరికి పిలిచాడు. "పెద్దవాళ్ళు మాత్రమే సమాధానం చెప్పాలని లేదు. తెలివిలో ఎవరు పెద్దయితే వారే అసలుపెద్ద ! చెప్పమ్మా" అన్నాడు.

"రాజా ! రాణిగారిచ్చిన నాణాలు వెయ్యినూట పదహార్లు" అని వెన్నెల చెప్పింది. రాజుగారు వెన్నెలను దగ్గరకు తీసుకొని సింహాసనం మీద కూర్చోబెట్టుకున్నాడు. "శభాష్! చిన్నదానివైనా సరిగ్గా చెప్పావు" అని పొగిడాడు. "అమ్మా! నీవు జవాబును కచ్చితంగా ఎలా చెప్పావు ?" అని రాజు అడిగాడు.



"మహారాజా! జవాబు మీ కథలోనే ఉంది. 'మసాలా వెయ్యి'లో వెయ్యి ఉంది. 'నూరుతున్నాడు'లో నూరు ఉంది. 'ఏడుస్తుంది'లో ఏడు, 'ఆరుతున్నాయి'లో ఆరు, 'మూడుతుంది' లో మూడు ఉన్నాయి. మొత్తం కలిపితే 1116 కదా !" అని ముద్దుగా వెన్నెల చెప్పింది. ఈ జవాబుకి రాజుతో పాటు రాణి కూడా ఆశ్చర్యపోయింది.

జనం చప్పట్లతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగింది. వెన్నెలను, వాళ్ళ అమ్మానాన్నలను అందరూ పొగడ్తల వర్షంలో ముంచెత్తారు. రాజుగారి బహుమానం వెన్నెలకు దక్కింది.

## అభ్యాసం

I. **అర్థాలు**

| | | | | | |
|---|---|---|---|---|---|
| షష్టిపూర్తి | = | 60 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత జరిపే వేడుక | గంగాళం | = | ఒక పాత్ర |
| | | | పొగడ్తలు | = | మెచ్చుకోవడం |
| | | | మేధావులు | = | తెలివిగలవారు |
| తండోపతండాలు | = | గుంపులు గుంపులుగా (ఎక్కువగా) | ఉవ్విళ్ళూరు | = | తహతహలాడు |
| | | | వేదిక | = | సమావేశం జరిగే చోటు (స్టేజి) |
| విద్వాంసులు | = | పండితులు | | | |
| ఆత్రంగా | = | ఆసక్తిగా | విపరీతం | = | ఎక్కువ |

## II. పదజాలం

**(అ) ఈ క్రింది వాటికి సరైన సమాధానాన్ని గుర్తించి బ్రాకెట్లలో రాయండి.**

1. రాజ్యంలో ఉత్సవాలు జరగడానికి కారణం ( )

   ఎ) రాణిగారి షష్టిపూర్తి బి) రాజుగారి షష్టిపూర్తి సి) మంత్రిగారి షష్టిపూర్తి

2. రాజుగారి సభకు వెళతానని మారాం చేసినది ఎవరు ? ( )

   ఎ) రైతు బి) కూలీ సి) వెన్నెల

3. రాజుగారు సభలో ప్రశ్న అడిగిన రోజు ఏ రోజు ? ( )

   ఎ) పౌర్ణమి రోజు బి) అమావాస్య రోజు సి) గ్రహణం రోజు

4.. వంటవాడికి బంగారు నాణాలు ఇచ్చింది ఎవరు ? ( )

   ఎ) రాజు బి) సైనికుడు సి) మహారాణి

5. వెన్నెల రాజుగారి నుండి బహుమతి పొందడానికి కారణం ( )

   ఎ) రాజుగారు చెప్పింది శ్రద్ధగా వినడం బి) వెన్నెల అదృష్టం

   సి) నాన్న భుజంమీద కూర్చోవడం

**(ఆ) ఈ క్రింది పదాలకు వ్యతిరేకపదాలు రాయండి.**

1. ప్రశ్న × ________
2. ________ × దురదృష్టం
3. పౌర్ణమి × ________
4. ________ × శాంతం
5. జాగ్రత్త × ________
6. ________ × పెద్ద
7. పొగడ్త × ________
8. ________ × అనవసరం

**(ఇ) ఈ క్రింది మాటలకు వచనాలను రాయండి.**

(ఒక వ్యక్తి లేక ఒక వస్తువు లేక ఒక జంతువును సూచించేది ఏక వచనం. ఉదా : రాజు, బల్ల, సింహం. ఒకరి కంటె ఎక్కువ వ్యక్తులను, లేక ఒకటి కంటె ఎక్కువ వస్తువులను, లేక జంతువులను సూచించేది బహువచనం. ఉదా : రాజులు, బల్లలు, సింహాలు.)

| ఏకవచనం | – | బహువచనం |
|---|---|---|
| 1. ఉత్సవం | : | ________ |
| 2. ________ | : | నాణాలు |
| 3. పండితుడు | : | ________ |
| 4. ________ | : | మేధావులు |
| 5. పొగడ్త | : | ________ |

**(ఈ) ఈ క్రింది మాటలను సొంత వాక్యాల్లో ప్రయోగించండి.**

1. ఉత్సవాలు : ________________
2. ఉవ్విళ్ళూరు : ________________
3. ప్రకటన : ________________
4. తండోపతండాలు : ________________
5. బహుమతి : ________________

**(ఉ) ఈ క్రింద ఇవ్వబడిన మాటల ఆధారంగా ఖాళీలను పూరించండి.**

| | | | |
|---|---|---|---|
| జయంతి | వజ్రోత్సవం | రజతోత్సవం | స్వర్ణోత్సవం |
| వర్ధంతి | వార్షికోత్సవం | దశాబ్ది ఉత్సవం | శతాబ్ది ఉత్సవం |


ఉదా : 60 సంవత్సరాలకు జరిపే వేడుక ______ షష్టిపూర్తి ______

1. సంవత్సరానికి ఒకసారి జరిపే వేడుక. ________________
2. పుట్టిన రోజు వేడుక. ________________
3. 25 సంవత్సరాలకు జరిపే వేడుక. ________________
4. 50 సంవత్సరాలకు జరిపే వేడుక. ________________
5. మరణించిన రోజు జరిపేది. ________________
6. 100 సంవత్సరాలకు జరిపే వేడుక ________________

7. 75 సంవత్సరాలకు జరిపే వేడుక. ______________

8. 10 సంవత్సరాలకు జరిపే వేడుక. ______________

**(ఊ)** పాఠంలో "పున్నమిరాత్రి వెన్నెలతో నిండి పిండి పరిచినట్లుగా ఉంది" అని చదివారు కదా ! మరి అమావాస్య రాత్రి ఎలా ఉంటుందో గుర్తుకు తెచ్చుకొని అమావాస్యకు సంబంధించిన పదాలు రాయండి.




## III. ప్రశ్నావళి

**(అ) ఈ క్రింది ప్రశ్నలకు రెండు లేదా మూడు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. రాజుగారు చేసిన ప్రకటన ఏమిటి ?
2. పౌర్ణమిరోజు రాజుగారి సభామండపానికి ఎవరెవరు వచ్చారు ? ఎలా వచ్చారు ?
3. వంటాయన భార్య పిల్లవాడిని ఏం చేసింది ?
4. రాజుగారి ప్రశ్న విన్న తర్వాత పండితులు ఎలా స్పందించారు ?
5. వెన్నెల రాజుగారి ప్రశ్నకు జవాబును ఏవిధంగా చెప్పింది ?

**(ఆ) ఈ క్రింది ప్రశ్నలకు ఆరు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. సభలోని వారందరికీ రాజుగారు చెప్పిన విషయాన్ని మీ సొంతమాటల్లో రాయండి.
2. కథలో రాణిగారికి ఇష్టమైన గుత్తివంకాయకూర ఎలా వండాలో తెలుసుకొన్నారు కదా ! మీకిష్టమైన వంటకం ఏదో రాసి, దాని గురించి రాయండి.

## IV. వ్యాకరణం

వర్ణమాలలోని "అ" నుండి "ఔ" వరకు ఉన్న అక్షరాలను "**అచ్చులు**" అని అంటారు. ఇవి స్వతంత్రంగా పలుకబడతాయి. అచ్చులను "స్వరాలు, "ప్రాణాలు" అని కూడా పిలుస్తారు. "క" నుండి "హ" వరకు ఉన్న అక్షరాలను "**హల్లులు**" అని అంటారు. హల్లులు అచ్చుల సాయంతో పలుకబడతాయి. వీటిని "**వ్యంజనాలు**" అని కూడా పిలుస్తారు.

"ం" (సున్న), "ఁ" (అరసున్న), "ః" (విసర్గ) లను "**ఉభయాక్షరాలు**" అని అంటారు.

అచ్చులూ, హల్లులూ రెండింటి ధర్మాన్ని కల్గి ఉండేవి ఉభయాక్షరాలు.

**(అ) ఈ క్రింది పదాలలో అచ్చులతో, హల్లులతో మొదలయ్యే వాటిని గుర్తించి క్రింది పట్టికలో రాయండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| అడవి, | వాగు, | నది, | ఇటుక, | ఐశ్వర్యం, | కోట, |
| గౌరి, | హరి, | మీగడ, | నాలుక, | ఈల, | ఓడ, |
| మనసు, | జోతలు, | ఔషధం, | విద్యార్థి, | మోహనుడు, | రామయ్య |

**అచ్చుతో మొదలయ్యే పదాలు:**

______________________________

______________________________

**హల్లుతో మొదలయ్యే పదాలు:**

______________________________

______________________________

______________________________

______________________________

## V. ప్రాజెక్టు పని



మీ పాఠశాల గ్రంథాలయంలోని ఒక కథను చదివి మీ సొంత మాటల్లో తరగతి గదిలో చెప్పండి.